# విజయం ఒకరోజు దూరంలో...

-యం.రమేష్‌కుమార్

రోజు మాదిరిగానే ఉదయం లేవగానే కళ్లు నులుముకుంటూ ఎదురుగా వున్న గోడ గడియారం వంక చూసాడు భరణి. ముందు గడియారంలో వున్న వినాయకుడి బొమ్మను చూసాక టైమ్ చూసాడు. ఆరు దాటింది. నిన్న తను తీసుకున్న నిర్ణయం గుర్తుకువచ్చింది. 'నా వ్రతం మొదలైంది. ఇంక ఈ రోజంతా జాగ్రత్తగా ఉండాలి' అనుకుంటూ లేచాడు.

బ్రష్ చేయడం అయ్యేసరికల్లా జయ కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది. భరణికి ఛర్రున కోపం వచ్చిందిగానీ తమాయించుకుంటూ అన్నాడు "అదేంటి జయా... నిన్న చెప్పింది మర్చిపోయావా?"

అతని ప్రశ్న పూర్తి కాకముందే జయ అందుకుని "అవునండీ మర్చిపోయాను. ఈ రోజంతా మీరు సాధువుల ఆహారం మాత్రమే తింటారన్నారట కదా. ఉదయం కాయగూరల జ్యూస్ చేయమన్నారు. మీరు స్నానం చేసి రండి. ఈలోగా జ్యూస్ రెడీ చేస్తాను" అని హడావుడిగా వెళ్లిపోయింది.

"సాధువుల ఆహారం కాదే బాబూ... సాత్వికాహారం" వెనుక నుంచి గట్టిగా అన్నాడు భరణి.

అసలు భరణి వ్రతం ఏమిటో, ఈ రోజంతా అతను ఏ నియమాలూ పాటించాలనుకుంటున్నాడో తెలియాలంటే ఒకరోజు వెనక్కు వెళ్లాలి.

ఈమధ్యకాలంలో భరణి కొన్ని పుస్తకాలు చదివాడు. ప్రకృతి ఆహారానికి సంబంధించిన పుస్తకాలే కాకుండా సూపర్‌మైండ్, మైండ్ గిమ్మిక్, విజయానికి సోపానాలు, మీ విజయం మీ భార్య చేతిలో... లాంటి పుస్తకాలు చాలా చదివాడు. వాటిల్లో కొన్ని విషయాలు అతనికి బాగా నచ్చాయి. వాటి ఆధారంగా అతను కొన్ని సూత్రీకరణలు చేసుకున్నాడు.

అవేమిటంటే ఆహారానికి, ఆరోగ్యానికి కాదు. ఆహారానికి, ప్రవర్తనకి కూడా సంబంధముంది. సాత్వికాహారం తింటే కోపతాపాలు బాగా తగ్గుతాయి. అసలే తనకి చిరాకు, కోపం ఎక్కువ. వాటి మూలంగా ఇంటా బయటా కూడా తన గౌరవం తగ్గిపోతోంది. అందువల్ల ప్రవర్తన విషయంలో తను పూర్తిగా మారాలి. దానికోసం పుస్తకాల నుంచి తను క్రోడీకరించుకున్న విషయాలను ఖచ్చితంగా అమలు చేయాలి. అవేమిటంటే మొహంలో చిరునవ్వు ఎప్పుడూ చెదరకూడదు. సాధ్యమైనంతవరకూ ఏ విషయాన్నయినా చిరునవ్వుతోనే డీల్ చేయాలి. చిరాకు, కోపం లాంటి భావాలు మొహంలో ప్రతిఫలించకుండా జాగ్రత్త పడాలి. చిన్న విషయాలకు కూడా థాంక్స్ చెప్పాలి. ఈ సూత్రాలే కాకుండా అవసరాన్నిబట్టి పుస్తకంలో చదివిన మరికొన్ని సూత్రాలు కూడా ఉపయోగిస్తూ ఉండాలి.

ఇవన్నీ అమలు చేయాలంటే ముందు తనకున్న చిరాకు, కోపం పూర్తిగా తగ్గిపోవాలి. అందుకోసం ప్రకృతి ఆహారం పుస్తకాల్లో చెప్పిన ఆహార నియమాలను కఠినంగా అమలు చేయాలి. అసలు సరిగ్గా చెప్పాలంటే ఇకనుంచి తనో కొత్త వ్యక్తిలా మారిపోతాడు. తన ఆహారం, ప్రవర్తన, అంతా కొత్తగానే వుంటుంది. తను ఏదైనా నిర్ణయం తీసుకున్నాడంటే వెనక్కి తగ్గే ప్రసక్తే ఉండకూడదు. ఇవీ భరణి ఆలోచనలు. చిరాకునీ, కోపాన్ని జయించి చిరునవ్వుల భరణిగా మారడంలో తను విజయం సాధిస్తాడని అతని గట్టి నమ్మకం.

అయితే భరణికి ఏదైనా ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు తన కజిన్ బ్రదర్ అయిన వామనమూర్తి సలహా తీసుకోవడం అలవాటు. ఏ విషయంలోనైనా వామనమూర్తి సరైన సలహా ఇస్తాడని అతని నమ్మకం. అదే ప్రకారం తను ఏ విషయాలనైతే అమలు చేయదల్చుకున్నాడో అవన్నీ వామనమూర్తికి వివరంగా చెప్పాడు భరణి.

అన్నీ విన్న తరువాత "బాగానే వుందిగానీ వీటన్నింటినీ ఒక్కసారిగా అమలు చేయడం కష్టం. ఒక్కొటొక్కటిగా అమల్లో పెట్టు" అన్నాడు వామనమూర్తి.

"అంటే నేను ఈ నియమాలన్నీ పాటించలేననా నీ ఉద్దేశ్యం?" అడిగాడు భరణి.

"అలా అని కాదుకానీ ఇలాంటి విషయాలు ఒకేసారి అమలుచేయడం కష్టం. మన ప్రవర్తననీ అలవాట్లనీ ఒక్కసారిగా మార్చుకోవడం అంత సులువేమీ కాదు. అదీగాక కొన్ని విషయాలు పుస్తకాల్లో చదివితే బాగానే ఉంటాయినీ వాటిని గట్టిగా అమల్లో పెడదామంటే మాత్రం తంటా వస్తుంది. చుట్టూ ఉన్న లోకం వల్ల కూడా అడ్డంకులు రావచ్చు" వివరించాడు వామనమూర్తి.

"ఒరేయ్ వామనం! నా సంగతి నీకు తెల్సుగా. నేనేదయినా అనుకున్నానంటే తప్పకుండా పాటించి తీరుతాను. ఇంక లోకంవల్ల అడ్డంకులు ఎందుకు వస్తాయో నాకర్థం కాలేదు. నేనే విధంగా ఉండాలనుకుంటున్నానో అదే విధంగా ఉంటాను. దాంట్లో లోకం ప్రసక్తి ఏముంది?" అసహనంగా అన్నాడు భరణి.

"సరే ఒక పని చేయి. నువ్వు ఏ విధంగా ఉండాలనుకుంటున్నావో అదే విధంగా ఒక రోజంతా గడిపి చూడు. ఆహారం విషయంలోనీ, ప్రవర్తన విషయంలోగానీ ఏ మార్పులు చేసుకోవాలనుకుంటున్నావో అవన్నీ చేసి చూడు. దాని వల్ల ఏ ఇబ్బందీ లేదనిపిస్తే అప్పుడు అదే కంటిన్యూ చేయవచ్చు. ఏమంటావ్?" సలహా ఇచ్చాడు వామనమూర్తి.

"నేను ఇకనుంచి పూర్తిగా మారదామని ఆలోచిస్తుంటే నువ్వు ఒక్కరోజు అంటావేమిటి? సరే నువ్వన్నట్లు నేననుకున్నవన్నీ ముందు ఒక్క రోజు పాటించి అందులో ఏ ఇబ్బందీ లేదని తర్వాత రోజు వచ్చి నీకు చెబుతాను సరేనా?" ధీమగా అన్నాడు భరణి.

"సరే కానీ" వామనమూర్తి ప్రోత్సహించాడు.

ఈ విషయాలన్నీ తల్చుకుంటూ స్నానం పూర్తి చేసాడు భరణి.

'వామనమూర్తి చెప్పినట్లుగా నియమాలు పాటించడంలో నిజంగా ఏమైనా ఇబ్బందులొచ్చినాగానీ ఈ రోజు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తిలేదు' స్థిరంగా అనుకున్నాడు భరణి.

స్నానం చేసి వచ్చేసరికి జయ కాయగూరల జ్యూస్‌తో వచ్చింది. భరణి దాన్ని ముక్కు దగ్గర పెట్టుకుని వాసన చూసాడు. అదోరకంగా అన్పించింది. తన సంకల్పం ముందు ఇదెంత? అనుకుంటూ ముక్కు మూసుకుని గటగటా తాగేసాడు. శివుడు గరళాన్ని మింగిన సీను అర్జెంటుగా గుర్తుకు వచ్చిందతనికి.

"ఏమిటింత దరిద్రంగా ఉందిది? ఏమేం కాయగూరలు వేశావిందులో?'' మొహం వికారంగా పెట్టి అడిగాడు.

"కారెట్, దోసకాయలు, టమాటో, కాకరకాయలు...'' చదివింది జయ.

"కాకరకాయలు ఎవడెయ్యమన్నాడు నిన్ను?'' సాధ్యమైనంత శాంతంగా అడిగాడు భరణి.

"అదేంటండీ... ఇంట్లో వున్న కాయగూరలన్నీ వెయ్యమన్నారుగా. అయినా కాకరకాయలు ఒంటికి మంచిదేగా'' అంది జయ.

భార్య మొహంలోకి పరిశీలనగా చూసాడు భరణి. జయ నిజంగా కాకరకాయలు ఒంటికి మంచిదని వేసిందో, లేక ఇలాంటి జ్యూస్ మరెప్పుడూ అడగకుండా వేసిందో అర్థం కాలేదతనికి. ఆ విషయం ఆలోచిస్తుండగా మరో సంగతి గుర్తుకువచ్చింది. భార్యకు థాంక్స్ చెప్పడం మరచిపోయాడు తను.

జయని వెనక్కి పిలిచి "థాంక్యూ జయా...'' అన్నాడు భరణి.

ఎన్నడూలేనిది భర్త థాంక్స్ ఎందుకు చెప్పాడో అని అతన్ని ఆశ్చర్యంగా చూసుకుంటూ వెళ్లిపోయింది జయ.

భరణికి తాగిన జ్యూస్ మూలంగా వాంతి వస్తున్నట్లు అనిపించి వంటగదిలోకి వెళ్లి కొన్ని ధనియాలు నోట్లో వేసుకున్నాడు.

అంతలోనే భరణి ఏకైక పుత్రరత్నం ఎనిమిదేళ్ల చింటుగాడు అక్కడికొచ్చి "డాడీ...! జిడ్డంకులొచ్చారు'' అన్నాడు.

భరణి అదిరిపడి "ఎవరూ?'' అన్నాడు కంగారుగా.

"అదే డాడీ... పక్కవీధి గోపాలం అంకులొచ్చారు.''

"తప్పు చింటూ... అంకుల్ని పట్టుకుని అలా జిడ్డు అది ఇది అనకూడదు'' బుజ్జగింపుగా అన్నాడు భరణి.



"అదేంటి... మొన్న నువ్వేగా మమ్మీతో ఆ గోపాలంగాడు పాలసీ కట్టమని జిడ్డులా తగులుకున్నాడని అన్నావ్?'' భరణికి ఫ్లాష్‌బ్యాక్ గుర్తుకువచ్చింది. పక్కవీధి గోపాలం ఈమధ్య అదేదో కంపెనీ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా జాయినయ్యాడు. 'మా దగ్గర బోలెడన్ని రకాల పాలసీలు ఉన్నాయి. నువ్వు ఏదో ఒకటి చేయాలి తప్పదు' అంటూ వెంటపడడం మొదలుపెట్టాడు. ఆ విషయమే జయతో చెప్తూ అలా అన్నాడు తను. అది చింటుగాడు విన్నాడన్నమాట. ఈకాలం పిల్లలతో జాగ్రత్తగా ఉండాలి అనుకుంటూ హాల్లోకి నడిచాడు. మొన్నేదో తను గోపాలం నుంచి తప్పించుకోవడానికి ఆదివారం రమ్మంటే ఓ పూటంతా తినేస్తాడేమోనని భయపడి ఏదో రోజు

„ఉదయాన్నే రండి మళ్లీ నేను తొమ్మిదిన్నరకల్లా ఆఫీసుకు బయల్దేరిపో తాను అన్నాడు. ఆ మాట పట్టుకుని ఉదయాన్నే దాడి చేసాడన్నమాట అనుకుంటూ గోపాలాన్ని చూసి చికాకు పడబోయి నియమాలు గుర్తు కొచ్చి చిరునవ్వును మొహానికి పులుముకున్నాడు భరణి.

గోపాలం డైరెక్టుగా మేటర్‌లోకెళ్లిపోయి ఏదో పాలసీల గురించి తోమడం మొదలుపెట్టాడు. అరగంట గడిచేసరికి భరణి సహనం చచ్చిపో యిందిగానీ చిరాకు, కోపం ఆపజయానికి మొదటి సోపానాలు అని పుస్త కంలో చదివిన విషయం గుర్తుకువచ్చి చిరునవ్వుతో వినసాగాడు. అదే సమయంలో భరణికి రచయిత రాసిన మరో విషయం గుర్తుకువచ్చింది. మొహమాటాన్ని సాధ్యమైనంతవరకు ఎవాయిడ్ చేయాలి. ఈ సూత్రం గుర్తుకురాగానే భరణికి ఎక్కడలేని ఆనందం ఆవరించింది.

"గోపాలంగారూ! నాకిప్పుడసలు పాలసీ చేద్దామనే ఇంట్రెస్టు లేదు. నిజం చెప్పాలంటే డబ్బు వెసులుబాటు కూడాలేదు. అంచేత వీలు చూసు



## రోబో మ్యూజిక్ కండక్టర్

ఇటీవల డెట్రాయిట్ సింఫోనీ ఆర్కెస్ట్రాని 'ది ఇంపాజిబుల్ డ్రీమ్' అనే ప్రఖ్యాత గీతాన్ని ప్లే చేయడానికి ఎఎస్ఐఎమ్‌వో అనే రోబో కండక్టు చేసి ఒపెరా ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచింది. ప్రారంభంలో ఒక చిన్న పిల్ల గొంతుకతో ప్రేక్షకుల్ని స్వాగతించి సింఫోనీని కండక్టు చేసి ఆఖరున వాళ్లు చప్పట్లు కొడుతుంటే వారికి అభివాదం చేసి అభినందనలు స్వీకరించింది. ఈ రోబోని ప్రోగ్రామ్ చేసిన సెల్లిస్ట్ యోయోమో చివరగా స్టేజీమీదకు వచ్చి అసిమోతో కలసి అవార్డును అందుకున్నాడు. ఈ రోబోని తయారుచేసిన హోండా కంపెనీ భవిష్యత్తులో కావాలన్న సంస్థలకు మరిన్ని రోబో కండక్టర్లని తయారుచేసి సప్లై చేస్తానంటోంది.

-తటవర్తి




కుని మరెప్పుడైనా చేద్దాంలెండి"

"భలేవారండీ మీరు. ఈ సంగతి ముందే చెప్పేస్తే పోయేదిగా" అని రుసరుసలాడుతూ బేగ్ సర్దుకుని వెళ్లిపోయాడు.

జయ ఈలోగా మొలకల టిఫిన్ తీసుకువచ్చింది. భరణి అందులో నిమ్మరసం పిండుకుని తినేసి 'అలవాటు అయ్యేంతవరకు ఈ తిండి ఇబ్బందే' మనసులోనే అనుకున్నాడు. వెళ్లేముందు లంచ్ బాక్స్ ఓపెన్ చేసి తను చెప్పిన ఐటమ్స్ ఉన్నాయో లేదో చెక్ చేసుకుని సంతృప్తిగా తలా డించి ఆఫీస్‌కి బయల్దేరాడు. టిఫిన్ ఇచ్చినప్పుడు, లంచ్ బాక్స్ అందించి నప్పుడు జయకు థాంక్స్ చెప్పడం మర్చిపోలేదతను.

పదకొండున్నరయ్యేసరికి మేనేజర్ నుండి భరణికి పిలుపు వచ్చింది. ఎప్పుడూ ఏదో ఒక పొరపాటు చేయడం, మేనేజర్ చేత తిట్లు తినడం భర ణికి పరిపాటి.ఈసారి తను చేసిన పొరపాటు ఏమిటో మేనేజర్ రూమ్‌లోకె ళ్లాక అర్థమయింది అతనికి. ఆనంద్ అండ్ కో కొటేషన్ బెటర్‌గా ఉందని తను నోట్ రాసాడు. అయితే నిజానికి శ్రీకృష్ణ అండ్ కో అంతకన్నా తక్కువ కోడ్ చేసింది. అయితే శ్రీకృష్ణ అండ్ కోని తాము బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లుగా తనకి గుర్తుంది. అందుకే ఆనంద్ అండ్ కోకు ఫేవర్‌గా నోట్ రాసాడు. కానీ మేనేజర్ చెప్పాక తనకు అసలు సంగతి తెలిసింది. అదేమిటంటే తాము బ్లాక్‌లిస్టులో పెట్టింది కృష్ణ అండ్ కో అనే కంపెనీని. దాన్ని శ్రీకృష్ణ అండ్ కోగా తాను పొరపాటు పడి అదీ ఇదీ ఒకటే కంపెనీ అనుకున్నాడు.

"డీటెయిల్స్ చూస్తే కృష్ణ అండ్ కో, శ్రీకృష్ణ అండ్ కోలు వేర్వేరు కంపెనీ లని స్పష్టంగా అర్థమవుతోంది. ఆమాత్రం చూసుకోలేదా?" అంటూ మండిపడ్డాడు మేనేజర్ రంగరాధం. భరణి సమాధానం చెప్పకుండా నిలబ డడం చూసి మేనేజర్‌కి మరింత కోపం వచ్చింది. 'పనిలో జాగ్రత్తగా ఉండడం ఇంక ఎప్పుడు నేర్చుకుంటావు' అంటూ తిట్టడం మొదలుపె ట్టాడు. భరణికి ఎప్పటిలాగే మేనేజర్ మీద పీకలదాకా కోపం వచ్చిందిగానీ అంతలోనే అతనికి పుస్తకంలోని విషయం ఒకటి హఠాత్తుగా గుర్తుకొ చ్చింది. అదేమిటంటే ఎవ్వరైనా మనల్ని బ్లేమ్ చేస్తూ మాట్లాడినప్పుడు చిరు నవ్వుతో వింటే అవతలివాళ్లు ఆటోమేటిగ్గా తగ్గిపోతారు. తమ వాదనలోనే పొరపాటు ఉందేమో అనే సంశయంలో పడతారు. భరణి వెంటనే ఆ సూత్రాన్ని అమల్లో పెడుతూ మేనేజర్ వంక చిరునవ్వుతో చూసాడు. మేనే జర్ వాక్ప్రవాహం ఆగింది. ఆ తరువాత కొద్దిసేపు ఏ జరిగిందో భరణికి సరిగ్గా అర్థం కాలేదు. తను చీవాట్లు పెడుతున్నా ఇంకా నవ్వుతున్నందుకు మేనేజర్ అరికాలిమంట నెత్తికెక్కింది. 'సిగ్గులేకుండా ఇంకా ఆ నవ్వేమిటి?' అంటూ చెలరేగిపోయాడు.

భరణి మేనేజర్ రూమ్ నుంచి బయటపడేసరికి అతని బుర్ర అదివరకె న్నడూ లేనంతగా వాచిపోయింది. పుస్తకంలో సూత్రాలను పాటించడంలో తానెక్కడ పొరపాటు చేస్తున్నాడో అర్థం కాలేదతనికి. మధ్యాహ్నం లంచ్ దగ్గర రోజు మాదిరిగానే భరణి, సుందరం, జనార్దన్ పక్కపక్కనే కూర్చు న్నారు. భరణి ముందే 'ఈరోజు మీ కూరలు నాకు వద్దు' అని చెప్పాడు. విషయం ఏమిటా అని అతని లంచ్ బాక్స్‌లోకి తొంగి చూసిన వాళ్లిద్దరూ అవాక్కయ్యారు. అందులో కొన్ని కొబ్బరిముక్కలు, మూడు అరటిపళ్లు, కొన్ని ఖర్జూరం పలుకులూ ఉన్నాయి.

"ఏమిట్రా లంచ్ బాక్స్‌లో ఇవి పెట్టారు?" అడిగారు ఇద్దరూ.

భరణి నవ్వి "ప్రకృతి ఆహారం ట్రై చేస్తున్నాను" అని చెప్పాడు.

"రోజూ ఇవే తింటావా?" జాలిగా అడిగాడు సుందరం.

"ఆరోగ్యంలో ఏదైనా ప్రాబ్లం వచ్చిందా? డాక్టర్ సజెస్ట్ చేసాడా?"

"అబ్బెబ్బే... అదేం కాదురా. ఇవి తింటే ఆరోగ్యంలో ఏ ప్రాబ్లమ్ ఉండదు" అంటూ కొబ్బరికాయ ముక్కలు కొరుక్కుని తినసాగాడు భరణి.

భరణిలో ఒక్కసారిగా వచ్చిన ఈ మార్పుకు ఆశ్చర్యపోతూ లంచ్ చేయడం మొదలుపెట్టారు వాళ్లు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జూనియర్ అసిస్టెంట్ రాగిణి "మీరు చెప్పిన డ్రాఫ్ట్ ప్రింట్ చేసాను సార్" అంటూ ఓ కాగితాన్ని భరణి టేబుల్ మీద ఉంచింది. ఠక్కున బుర్ర పైకెత్తి చిరునవ్వు నవ్వి "థాంక్స్" అన్నాడు. తన మాటలకి ఎప్పుడూ 'ఊ' అనేసి ఊరుకోవడంతప్ప ఏనాడూ తలెత్తయినా చూడని భరణి హఠాత్తుగా నవ్వుతూ థాంక్స్ చెప్పేసరికి రాగిణికి ఆశ్చర్యం వేసింది. అతనివైపు అనుమానంగా చూస్తూ వెళ్లిపోయింది. తిన్న తిండి ఏం తేడా చేసిందోగానీ ఆ రోజు అతనికి రెండుమూడుసార్లు టాయ్‌లెట్‌కి వెళ్లాల్సి వచ్చింది. సాయంత్రమయ్యేసరికి భరణికి చాలా నీరసంగా అనిపించింది. ఆఫీసయ్యాక బైటకు వస్తుండగా సుందరం, జనార్దన్ అతని వెనుకే వచ్చారు.

"ఒరేయ్ భరణీ! నిజం చెప్పు. నువ్వు అవసరంలో వుంటే ఆమాత్రం మేం ఆదుకోలేమనుకున్నావా?" సూటిగా అడిగాడు సుందరం.

"ఎంత నెలాఖరు అయితే మాత్రం తిండికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులు ఏమిట్రా?" నిలదీసాడు జనార్దన్.

"లేకపోతే ఏంట్రా? ఇష్టమైన కూరేదీ లేకపోతే ముద్ద దిగదనేవాడివి. అలాంటిది ఇంటి దగ్గర దేవుడికి పెట్టిన ప్రసాదం లంచ్‌కింద తెస్తావా?"

'దేవుడి ప్రసాదమేమిటి?' అని తికమకపడి 'ఓహో... తను తెచ్చిన లంచ్ వాళ్లకి అలా అనిపించిందని గ్రహించి "అదికాదురా బాబూ! నేను నిజంగానే ప్రకృతి ఆహారాన్ని ఫాలో అవుదామనుకుంటున్నాను" అంటూ వాళ్లకి నచ్చచెప్పి అసలే నీరసంగా ఉన్న భరణికి శోష వచ్చినంత పనైంది.

భరణి తెచ్చే రుచికరమైన కూరలకు అలవాటుపడ్డ వాళ్లు "ఏదేమైనా ఈ పద్ధతి మాకేం నచ్చలేదురా" అంటూ తమ అసంతృప్తిని వెళ్లగక్కారు.

సాయంత్రం ఇంటికొచ్చి నీరసంగా సోఫాలో వాలిపోయిన భరణి దగ్గరకు వచ్చి "రాత్రికి ఏం తింటారో చెప్తే?" సందేహంగా అడిగింది తను.

భరణి ఠక్కున లేచి స్టిఫ్‌గా కూర్చుని "మళ్లీ చెప్పడమేమిటి? ముందే చెప్పానుగా రాత్రికి పళ్లు మాత్రమే నా ఆహారం. అదీ ఏడుగంటలకు ముందే" అన్నాడు. "సరే...సరే" అటూ వెళ్లిపోయింది జయ.

'ఏదేమైనా ఈరోజు తను అనుకున్నట్లుగానే అంతా జరగాలి. అయినా ఒక్కరోజు కూడా అనుకున్నది అనుకున్నట్లుగా చేయలేకపోతే ఇంక తన బతుకెందుకు?' అనుకున్నాడు భరణి.సాయంత్రం పళ్లు మాత్రమే ఆహారంగా తీసుకున్న భరణికి ఆ తిన్నవి ఎక్కడికి వెళ్లాయోగానీ రాత్రి పదిగంటలు అయ్యేసరికి కరకరా ఆకలి వేయసాగింది. దానికితోడు విపరీతమైన నీరసంగా అనిపించింది. కడుపునిండా నీళ్లు తాగి వచ్చి పడుకున్నాడు.

'మేనేజర్ తనని తిట్టడం మామూలేగానీ ఈరోజు మరీ ఘోరం' పుస్తకాల్లో సూత్రాలను పాటించడం తనవల్ల అయ్యేట్లు కనిపించడంలేదు' దిగులుగా అనుకున్నాడతను. నిద్రలో అతనికి విచిత్రమైన కలలు వచ్చాయి. మేనేజర్ రంగనాధాన్ని ఆ పోస్టునుంచి పీకేసినట్లు, ఆ స్థానంలో తాను మేనేజర్ అయినట్లు, తను రెస్టారెంట్‌కి వెళితే తనకి అక్కడ చికెన్ బిర్యానీ వడ్డిస్తూ సర్వర్ గెటప్‌లో మేనేజర్ కనబడినట్లు ఏదో పిచ్చి కలలు.

***

ఉదయం మెలకువ రాగానే ఎప్పటి మాదిరిగానే గడియారంలో వినాయకుడి బొమ్మను చూసాక టైమ్ చూసాడు. ఏడుగంటలు దాటింది.

"అమ్మయ్య.. ఒకరోజు గడిచిపోయింది" రిలీఫ్‌గా ఫీలవుతూ అనుకున్నాడు. అద్దంలో తనని తాను చూసుకున్నాడు భరణి. రాత్రి సరిగ్గా నిద్ర లేనందువల్ల కాబోలు కళ్లు కొంచెం ఎర్రబడ్డాయి.

"ఏదేమైనా వామనంగాడు చెప్పినట్లు పుస్తకాల్లో నియమాలు పాటించడం యమ యాతనగా ఉంది. రోజూ పాటించాలంటే? అమ్మో... తనవల్ల అయ్యే పనికాదు. అయినా ఈ నియమాలు మన మానసిక, శారీరక ఆరోగ్యాలకు అంతగా సరిపడినట్లు లేదు. ఈ రోజు నుంచి ఎప్పటి మాదిరి భరణి లాగే ఉండడం మంచిది" తనకు తనే చెప్పుకున్నాడతను.

బ్రష్ అయ్యాక స్నానానికి వెళ్తున్న భరణితో "కాయగూరల జ్యూస్ రెడీ చేయమంటారా?" అడిగింది జయ.

"జ్యూసూ గీసూ ఏమీవద్దు. అర్జంటుగా టిఫిన్ రెడీ చేయి. రోజూ ఆ ఇడ్లీలు తినలేక ఛస్తున్నాను. ఏ జీడిపప్పు సేమ్యా ఉప్మానో, పూరీలో చేసి తగలడు" అని చిరచిరలాడుతూ స్నానానికి వెళ్లాడు భరణి.

నిన్నటినుంచీ విచిత్రంగా ప్రవర్తిస్తున్న భర్తని చూసి బెంబేలెత్తిపోతున్న జయ అతను మళ్లీ ఎప్పటి మాదిరిగా ప్రవర్తించడంతో స్థిమితపడి టిఫిన్ రెడీ చేయడానికి కదిలింది.

★



## కెరీర్ ముఖ్యం

షారుఖ్-సల్మాన్‌ల మధ్య జరిగిందని తెగ వార్తలు వచ్చాయి కదా! ఈ గొడవ కారకురాలైన కత్రినా కైఫ్ సల్మాన్‌కి మంచి 'ఫ్రెండ్' అని అందరికీ తెలుసు. అయితే తను పర్సనల్ విషయాలకన్నా ప్రొఫెషనల్‌గానే బావుంటానని రుజువుచేస్తూ కత్రినా- షారుఖ్‌తో కలిసి నటించేందుకు ఓ సినిమాని సైన్ చేసి బాలీవుడ్‌ని ఆశ్చర్యపరిచింది. అవును మరి, అనవసర గొడవల వల్ల సినిమాలు వదలుకుంటే ఎలా? కత్రినా తెలివితేటలకి అంతా విస్తుపోతున్నారు.

